దీపావళి కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందినది

# జవాబు చెప్పాల్సిన ప్రశ్న!

పెద్దాడ మూర్తి

పెళ్లిబట్టలు కొంటూండగా సుధీర అడిగిన ప్రశ్నకి ప్రకాశం ఉలిక్కిపడ్డాడు. "పెళ్లి కూతురికేం కావాలో, ఏమిటో... తనకు నచ్చిన బట్టలు దగ్గరుండి కొను!" అని తల్లిదండ్రులు అనడంతో సుధీరని వెంటబెట్టుకుని ఆ షాపుకి వచ్చాడు ప్రకాశం.

బట్టల సెలెక్షన్ అనుకున్నదానికన్నా చాలాసేపు సాగింది. చూపించినవి నచ్చకపోవడంతో, సుధీర అడిగిన బట్టలు లోపలనుంచి తేవడానికి షాపు కుర్రవాడు వెళ్లినప్పుడు వాళ్లు కబుర్లలో పడ్డారు.

అంతకు ముందెప్పుడూ వాళ్లు కబుర్లలో పడలేదని కాదు. పెద్దలు కుదిర్చిన సంబంధమే అయినప్పటికీ, వాళ్ల మధ్య స్నేహభావం నెలకొనడంతో అడపాదడపా బయటకు కలిసి వెళ్లడం, అచ్చట్లు, ముచ్చట్లు చెప్పుకోవడం జరుగుతూనే ఉంది. కానీ ఆ రోజు కబుర్లు మాత్రం సుధీర కావాలని మొదలు పెట్టినట్టనిపించింది ప్రకాశానికి ఆ ప్రశ్న తరువాత పునరాకించుకున్నప్పుడు.

తన ఉంగరంలో రాయి గురించి మొదలుపెట్టింది సుధీర. రాశులు, నక్షత్రాలు వాటి గురించి మాట్లాడాక "మొన్ననే ఎవరో అన్నారు, మన దేశంలో చాలామంది జన్మ నక్షత్రాలు గుర్తుపెట్టుకుంటారు కానీ, తమ బ్లడ్ గ్రూప్ గుర్తు పెట్టుకోరు అని!" అంది.

ప్రకాశం చట్టున "వాళ్లలో నేనూ ఒకణ్ణి!" అన్నాడు. సుధీర ఎర్రగా చూడడంతో, "అవసరం పడలేదు. ఈసారి చూపించుకుని నోట్ చేసుకుంటా!" అని చేర్చాడు.

కానీ సుధీర వదిలిపెట్టలేదు. బ్లడ్ గ్రూపింగ్, బ్లడ్ డొనేషన్, జాగ్రత్త పడవలసిన విషయాలు అన్నీ ఏకరువు పెట్టింది. చివరగా అడిగిందా ప్రశ్న- "మీరు హెచ్ఐవి టెస్ట్ చేయించుకున్నారా, లేదా?" అని.

సుధీర కాస్త చొరవ ఉన్న మనిషని ప్రకాశం అనుకుంటూనే ఉన్నాడు కానీ బొత్తిగా కాబోయే భర్తను 'ఎయిడ్స్' ఉన్నదేమో చూపించుకున్నారా, లేదా అని అడిగేటంత బోల్డ్ టైప్ అనుకోలేదు. దానికెలా రియాక్టవ్వాలో తెలియక నవ్వు ముఖానికి పులుముకుని, "జోకా? జోకయితే బాగాలేదు. ఇట్ ఈజ్ ఇన్ పూర్ టేస్ట్!" అన్నాడు.


సుధీర మొహంలో కొంటెతనం తొంగి చూడలేదు, సీరియస్‌గానే "జోక్ కాదు కాబట్టి పూరో, రిచ్చో డిస్కస్ చేయనక్కరలేదు. నిజంగానే అడుగుతున్నాను. భార్యా భర్తలన్నాక ఆమాత్రం కన్‌సన్ ఉండడంలో తప్పేముంది?" అంది.

"కన్‌సన్ ఏమిటి? బొత్తిగా ఔట్ రేజియస్‌గా, ఇలా ఎవరైనా అడుగుతారా?" అన్నాడు ప్రకాశం మొహం చిట్లించి.

"ఎవరైనా అడిగినా అడగకపోయినా, మేరేజ్‌కి కాంజుగల్ బ్లిస్ చాలా ముఖ్యమని అందరూ ఒప్పుకుంటారు. ఎయిడ్స్‌లాంటిది ఉంటే ఆ సంతోషం ఎక్కణ్ణుంచి వస్తుంది?" అంది సుధీర స్థిరంగా.

ప్రకశం కంగారుగా అటూ ఇటూ చూశాడు. హెచ్ఐవి అంటే అర్థం కాకపోయినా ఎయిడ్స్ అంటే మాత్రం అందరికీ తెలుస్తుంది. షాపు కుర్రవాడు కూడా చీరలు పట్టుకుని వచ్చేస్తున్నాడు. "రా ... మంచినీళ్లు తాగుదాం!" అంటూ వాటర్ కూలర్ వద్దకు లాక్కొచ్చి, "ఇదంతా అందరికీ తెలుసు కానీ నువ్వు అలా ప్రశ్నించడంలో అర్థం ఏమిటి? నా మీద అనుమానమా?" అని అడిగాడు.

సుధీర ఏమీ పశ్చాత్తాపపడినట్టు కనబడలేదు. "ఎయిడ్స్ అలాగే రావాలని ఏమీ లేదు. రక్తమార్పిడి వల్ల కూడా రావచ్చుగా! మీ కెప్పుడైనా రక్తం ఎక్కించి ఉంటే..."



"మహాప్రభో... ఆ పదం వదిలెయ్! ఇంతకీ ఆ ప్రమాదం నీకూ ఉందిగా! నువ్వు చూపించుకున్నావా?"

"చూపించుకున్నాను కాబట్టే ఇంత ధాటీగా అడగగలుగుతున్నాను."

"అదా సంగతి! సరే... నేనూ చూపించుకుని నీకు రిపోర్ట్ చూపిస్తాను కానీ ఇంతటితో ఆవు."


బట్టలు కొనుక్కుని బయటకు వెడుతూంటే ఉండబట్టలేక ప్రకాశం అడిగాడు "నువ్విలా హెచ్ఐవి టెస్ట్ చేయించుకున్నట్టూ, నన్ను చేయించుకోమన్నట్టూ మీ ఇంట్లో చెప్పావా?"

చిరునవ్వు నవ్వింది సుధీర. "చెప్పలేదు, చెబితే తిట్టిపోస్తారు. మీతో మాట్లాడినట్లు వాళ్లతో మాట్లాడగలనా?"

పెళ్లవకుండానే వాళ్లిద్దరి మధ్యా ఆత్మీయత పెరిగినట్టు గ్రహించాడు ప్రకాశం. ఆమె చెయ్యి పట్టుకుని నొక్కి వదిలేశాడు. ఆ రోజు అంత సామరస్యం కనబరిచిన ప్రకాశం ఇంకోలా ప్రవర్తిస్తాడని సుధీర నమ్మలేకపోయింది. ఎవరు చెప్పినా కూడా!

నాలుగు రోజుల తరువాత తండ్రి చికాకు పడుతుంటే అడిగింది ఏమైందని. సంబంధం కుదిర్చిన రామేశ్వరరావు చెప్పాడట మగపెళ్లివారు విషయం నానుస్తున్నారని. ముహూర్తం వాయిదా వేయాలేమో అంటున్నారట. కారణం తెలియక తండ్రి తలకాయ బద్దలు కొట్టుకోవచ్చు. కానీ తనకు తెలుసు తను అడిగిన ప్రశ్నకు ప్రకాశం పురుషాహంకారం దెబ్బతిందని. దాని ఫలితమే ఇదని!

తండ్రికి చెబితే



# దీపావళి కథలపోటీ ఫలితాలు

మనిషి సంపాదించుకున్న సమస్తాన్నీ సవాల్ చేస్తున్న మహమ్మారి రోగం ఎయిడ్స్ ఎన్ని హై'టెక్కు'లకు పోయినా, మనిషి అధిగమించలేని ఈనాటి రాకాసి ఎయిడ్స్ ఈ అంశంపై 'దీ న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సమర్పణలో 'పాన్ పిక్చర్స్'వారు హిందీలో 'నిదాన్' పేరిట (తెలుగులో 'నీ మనసు...నా మనసు' పేరిట అనువదించి) ఓ చిత్రం అందించారు. మానవీయ కోణంనుంచి ఎయిడ్స్ మహమ్మారి గురించి జనాన్ని జాగృతం చేసిన గొప్ప ప్రయత్నం ఇది. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ఇదే స్ఫూర్తితో దీపావళి సందర్భంగా ఇదే అంశంపై కథలపోటీ నిర్వహించింది. ఈ పోటీకి సుమారు 90 కథలు వచ్చాయి. వీటిలో సగానికిపైగా వ్యాసరూపంలో ఉన్నాయి. కథాగమనం, శైలి, ఎత్తుగడ, డ్రామా, సామాజిక కోణం, వర్తమాన ప్రయత్నాలు, ఎయిడ్స్‌పట్ల ఉండాల్సిన సామాజిక బాధ్యత... తదితర విషయాలతో లోతైన మానవీయ ప్రయత్నంగానీ, ఓ కొత్త ఆలోచనగానీ చాలాకథల్లో కనిపించలేదు. కొన్ని కథల్లో అయితే, ఎయిడ్స్‌రోగానికి సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని పాత్రలమధ్య సర్దుబాటు చేస్తూ ముగించారు. వచ్చినకథల్లో ఉత్తమం అనిపించిన మూడు కథలను కన్సొలేషన్ బహుమతికి ఎంపిక చేయడం జరిగింది. ప్రకటించిన బహుమతులస్థాయికి సరితూగే కథలు రాకపోవడంతో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రద్దుచేయడం జరిగింది. కన్సొలేషన్ బహుమతులకుమాత్రం అర్హమైనవిగా మూడు కథలను స్వీకరించాము. అవి...పెద్దాడ మూర్తి రాసిన 'జవాబు చెప్పాల్సిన ప్రశ్న', ఎం.ఎస్. స్వాతి రాసిన 'పరీక్ష', రాజ రామ్మోహనరావు రాసిన 'అమృతం' కథలు. వాటిలో ఈవారం ప్రచురిస్తున్న కథ 'జవాబుచెప్పాల్సిన ప్రశ్న'. ఈ పోటీలో పాల్గొని తమవంతు కర్తవ్యాన్ని, బాధ్యతను నిజాయితీగా చాటిన అందరు రచయితలకు మా ధన్యవాదాలు.

-సంపాదకుడు

మండిపడతాడు. అడగాల్సింది ప్రకాశాన్నే కాబట్టి అతని ఆఫీసుకే ఫోను చేసింది. సెలవట. ఏం చేయాలా అని ఆలోచించి స్నేహితురాలు రేఖ ఇంటికెళ్లి ఆమె చేత ఫోన్ చేయించింది ప్రకాశానికి తన గొంతు గుర్తుపట్టవచ్చేమోనన్న భయంచేత.

ప్రకాశం లైన్లోకి వచ్చి రేఖ ఎవరాని కన్‌ఫ్యూజ్ అవుతూండగా సుధీర తీసుకుంది ఫోన్.

"ఎంసిపి అంటే ఏవేవో అర్థాలు చెబుతారు కానీ, 'మేల్ షావనిస్ట్ ప్రకాశం' అని నాకు అర్థమైందిలెండి..." తో మొదలుపెట్టి ఏవేవో అంది.

కానీ ప్రకాశం పెద్దగా రియాక్ట్ కాలేదు. ఆమె తొందరపాటుకు విసుక్కున్నాడంతే! ఆమె దానికి జవాబు చెబుతూండగానే ఇంత తొందరపాటు మనుషులతో పెళ్లి కాకపోవడం తన అదృష్టం అన్నాడు. దాంతో సుధీర కోపం తారాస్థాయినంటింది.

"ఈ మాత్రం తెలివి ముందే ఉంటే..." అని తిట్టనారంభించబోతూంటే

"కాస్త ఆగండి, నా సంగతి తెలిస్తే మీరే నన్ను చేసుకోరు!" అంటూ మెల్లగా "నాకు హెచ్ఐవి పాజిటివ్" అన్నాడు గొంతు తగ్గించి.

ఒక్క క్షణం అవాక్కయిన సుధీర "ఇదంతా పెద్ద నాటకం, నేను నమ్మను!" అంటూండగానే ఆమెను కట్‌చేసి, "సాయంత్రం ఋషి గార్డెన్స్‌కి వస్తే రిపోర్టులు చూపిస్తాను!" అంటూ ఫోన్ పెట్టేశాడు ప్రకాశం.

ఆ సాయంత్రం రిపోర్టు ఆమె మొహంమీద దాదాపు విసిరికొట్టాడు ప్రకాశం "ఇప్పటికైనా నమ్ముతారా!" అంటూ.

రిపోర్ట్ చూసి ఆమె నివ్వెరపోయింది. "మీకు ఎయిడ్సా? తప్పేమో! వేరే చోట కూడా చూపించుకుని కన్‌ఫర్మ్ చేయించుకోండి. తొందరపడకండి!" అంది కంగారుపడుతూ.

"ఆ భాగ్యమూ అయింది. అక్కడా ఇదే అన్నారు!" అంటూ ఇంకో రిపోర్ట్ తీసి విసిరేసి నేల మీద కూలబడి మొహం చేతుల్లో దాచుకున్నాడు ప్రకాశం.

పది నిమిషాలపాటు సుధీర ఏమీ మాట్లాడలేకపోయింది. చివరికి అతని తలమీద చేయి వేసి నిమురుతూ, "ఎలా వచ్చింది?" అని అడిగింది.

"అది పక్కన పెట్టండి... మీకు అనుమానం తీరిందా... నే నెందుకు పెళ్లి వద్దంటున్నానో! నా ఎయిడ్స్ మరొకరికి పాకకూడదని పెళ్లి వద్దన్నాను. ఇందులో అహంకారమూ లేదు, మరో కారమూ లేదు!" అన్నాడు తలెత్తి రోషంగా.

ఎర్రగా ఉన్న అతని కళ్లల్లోకి లోతుగా చూస్తూ, "సారీ... నా మాటలు పట్టించుకోకండి. కానీ అందరికీ ఏం చెప్తారు?"

"ఏం చెప్పాలా అని ఇన్నాళ్లూ ఆలోచిస్తూ వచ్చాను. చెప్పకపోతే ఇలాంటి అపార్థాలు వస్తాయి. కట్నం ఎక్కువ అడుగుతున్నాననుకుని మీ నాన్నగారు పోలీసు రిపోర్టు కూడా ఇవ్వగలరు. ఇవాళే నిశ్చయించుకున్నాను... అందరికీ నిజం చెప్పేస్తాను."

"అలా అయితే సంఘంలో వెలివేసినట్లు చూడరూ!" అంది సుధీర జాలిగా.

"చూడనీ... నేను చేసిన దానికి అదే సరైన శిక్ష!"

"ఏం పాపం చేశారేమిటి?"

"ఇంకేమిటి... నువ్వు అనుమానించినదే!"

సుధీర కంగారుపడింది. "క్షమించాలి, ప్రకాశంగారూ...! నేనడిగింది అనుమానంతో కాదు."

"ఏమయితే ఏముందిలెండి, జరిగింది మాత్రం అదే! ఒకే ఒక్కసారి. అదీ ముందుగా అనుకుని కాదు... ఉద్యోగం వచ్చిన కొత్తల్లో, రూమ్‌లో ఉండేవాళ్లం నలుగురం కలిసి. పేకాటలో పందెం వేశాడు మావాడు. నెగ్గినవాడికి అమ్మాయిని తెప్పిస్తానని పందెం. నేను నెగ్గాను. ఏదో జోక్‌గానే అనుకున్నాను. కానీ మా వాడు ముందుగానే ఫోన్ చేసి చెప్పేసినట్టున్నాడు. ఆ టైమ్‌కి కాల్‌గర్ల్ సిద్ధం! వద్దన్నాను, పొమ్మన్నాను. కానీ వాళ్లంతా ఆటపట్టించారు. చేతకాని వాడినన్నారు. మగాణ్ణే కాదన్నారు. పంతం వచ్చి సరేనన్నాను. ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నాను" హృదయభారం తీరిపోయినట్లు ప్రకాశం తేలిగ్గా లేచి నిల్చున్నాడు.

సుధీర మౌనంగా గడ్డి పీకుతూ కూర్చుంది. లేచే ప్రయత్నం చేయలేదు.

"మీ నిజాయితీకి జోహార్లు!" అంది ఆరాధనగా చూస్తూ.

అతడు నిర్లిప్తంగా నవ్వాడు. "దట్ ఈజ్ ది ఓన్లీ వర్యూ!" అన్నాడు.

"అలా కాదు ... మీ ఫ్యూచర్ ప్లాన్స్...?"

"ప్లానేముందీ? ఇంట్లో చెబుతాను. తిడతారు. పడతాను. బంధువుల్లో కూడా తెలుస్తుంది. ముంధు నన్ను వెక్కిరించినా నాలాంటివాళ్లు జాగ్రత్తపడతారు. ఇలాంటి వెధవ పనులు చేయకుండా. ఎవరూ లేని చోటికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని పోతాను. ఇక్కడ ఉన్నానంటే నన్ను ముట్టుకోవడానికి కూఢా హడలి చస్తారు మావాళ్లు!"

"అది సరే ... పెళ్లి విషయం?"

ప్రకాశం తెల్లబోయాడు. "పెళ్లా... పెళ్లేమిటి? ఛ... ఛ... బ్రహ్మచారిగానే ఉండిపోతాను. అయినా ఇది తెలిశాక నన్ను పెళ్లి చేసుకునేందుకు ఎవరు వస్తారు?" అన్నాడు అతి కష్టంమీద నవ్వు జోడిస్తూ.

"ఎవరో ఎందుకు? నేను లేనా?" అంది సుధీర అతని చేయిపట్టి కిందకు లాగుతూ.

"మతి పోయిందా?" అన్నాడు ప్రకాశం విధి లేక కూలబడుతూ.

"ఎయిడ్స్ రాగానే మనుషులు పోరు. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది, అంతేగా!"

"అది నాకూ తెలుసు. కానీ నువ్వన్న కాంజుగల్ బ్లిస్.."

"దానికేముంది? ప్రాక్టికల్‌గా ఏవో వాడవచ్చుగా?"

"అవి వాడితే పిల్లలు పుట్టరు."

"పుట్టకపోతే పోనీ, అందరికీ పిల్లలుండరుగా!"

"ప్రతిదానికీ ఏదో చెబుతావు. నువ్వెందుకు ఇంత తలకాయ నొప్పి తెచ్చుకోవాలి?" అన్నాడు ప్రకాశం ఆమెకేసి అభిమానంగా చూస్తూనే.

"కారణం విన్నా మీరు తట్టుకుంటారనే చెప్పేస్తున్నా. మీరు చేసిన తప్పే నేనూ చేశాను కాబట్టి!" అంది సుధీర తల వంచుకుని.

ప్రకాశం కళ్లప్పగించి చూస్తూ ఉండిపోగా, సుధీర కొనసాగించింది

"అసలు నాకు దీని గురించి ఆలోచన ఎందుకు వచ్చిందనుకున్నారు? మా కాలేజ్ మేట్ ఒకామె కాలేజీ రోజుల్లో, పిక్నిక్ వెళ్లినప్పుడు సరదాగా తిరిగింది. ఈ వ్యాధి తెచ్చుకుంది. ఈమధ్యే బయటపడింది. తెలియగానే ఆత్మహత్య చేసుకుంది. అందుకనే నాకూ అనిపించింది పరీక్ష చేయించుకుని చూస్తే మంచిదని!"

"నువ్వెందుకు చేయించుకోవడం?" అయోమయంగా అడిగాడు ప్రకాశం.


"ఇంకా అర్థం కాలేదా? ఆమే, మీరూ చేసిన తప్పే నేనూ చేశాను. ఎవరో తాగించి స్పృహ తప్పించారని అబద్ధాలు చెప్పను. జస్ట్ ఫర్ ఫన్ అనుకున్నాం. నా అదృష్టం బాగుంది. నాకు రాలేదు. మీ లక్ బాగాలేదు. వచ్చింది. తప్పు మాత్రం ఇద్దరిదీ ఒకటే!"

"ఐ డోన్ట్ బిలీవ్ ఇట్... ఆడవాళ్లు అలా చేయరు."

"ఓకే! మీ నమ్మకాలు మీవి. నేను వాదించను. నేను చెప్పేదేమిటంటే మనం పెళ్లి చేసుకుందాం. ఎయిడ్స్‌కు వాక్సిన్ కనిపెట్టారని ఈమధ్యే పేపర్లో వచ్చింది. అలాగే మందులేవో కూడా కనిపెడుతూనే ఉంటారు. అవి మన చేతికంది మీకా వ్యాధి వదలిపోయేవరకూ జాగ్రత్త పడదాం. పెళ్లిని కాదనకండి, ప్లీజ్!" అంది సుధీర.

ఆమె అంతలా అడుగుతుంటే కాదని ఎలా అనగలడు ప్రకాశం?

■

దీపావళి శుభాకాంక్షలతో......

రాష్ట్రంలో పోటీ పరీక్షల శిక్షణలో అగ్రగామి విద్యా సంస్థ

" రాష్ట్రీయ ఏక్తా" అవార్డు మరియు "The Pride of India" అవార్డు గ్రహీత శ్రీ పులప రామకృష్ణ గారి నిర్వహణలో

R.K. STUDY CENTRE

జాంపేట, పెద్దవీధి, రాజమండ్రి. ఫోన్స్ : 478808, 441991

☞ దేశంలోని అన్ని బ్యాంకులలోను మా విద్యార్థులను కలిగివున్న ఏకైక పోటి పరీక్షల కోచింగ్ సంస్థ

☞ 1621 మందికి 1999-2000లో వివిధ ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగాలను కల్పించిన ఏకైక సంస్థ.

*Excellent Coaching for*

**B.S.R.B., R.R.B., S.S.C, M.B.A, M.C.A,B.Ed. CET**

| | |
|---|---|
| B.S.R.B., R.R.B, కి హాస్టల్ వసతి కలదు | మాకు మరెక్కడా బ్రాంచీలు లేవు |

Sri Anu Ads, 475844